చీనీ సాగు.. లాభాలు బాగు

• తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలిక ఆదాయం
• పండ్ల తోటల సాగుపై దృష్టి సారిస్తున్న రైతన్నలు



కాయలతో నిండుగా కనిపిస్తున్న చీనీ చెట్టు



నాగసముద్రంలో సాగుచేసిన చీనీ తోట

గుంతకల్లు రూరల్: సంప్రదాయ పంటలతో ఏటా నష్టాలు చూస్తున్న రైతులు పండ్ల తోటల సాగుపై దృష్టి పెట్టారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు, అధిక ఆదాయాన్ని ఇచ్చే పంటల్లో ప్రధానమైన చీనీ పంట సాగు చేస్తూ అన్నదాతలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. పంటసాగు చేసిన నాలుగు సంవత్సరాలకు మొదలై 12 – 15 సంవత్సరాల వరకూ క్రమం తప్పకుండా దిగుబడులను ఇస్తున్న చీనీ పంట మంచి లాభాలను తెచ్చిపెడుతుంది. పండ్ల తోటల పెంపకం అతి తక్కువగా ఉన్న గుంతకల్లు మండలంలో ఇటీవల రైతన్నలు చీనీ సాగుపై దృష్టి సారించి మంచి లాభాలను గడిస్తున్నారు. బోరులో సమృద్ధిగా నీరు, పంటసాగులో సరైన మెలకువలు పాటించ గలిగితే చీనీ సాగు రైతన్నలకు సిరులు కురిపిస్తుందంటున్నారు హార్టికల్చర్ అధికారులు. చీనీ సాగులో రంగపురి, జంబేరి రకాలు చాలా నాణ్యమైన మొక్కలు. ఈ మొక్కలు పులివెందుల సమీపంలోని సింహాద్రిపురం, సత్యసాయి జిల్లాలోని చిగిచెర్లలో ఉన్న హార్టికల్చర్ నర్సరీల్లో అందుబాటులో ఉన్నాయి. ఒక్కో మొక్క రూ.60తో కొనుగోలు చేసి ఎకరాకు 111 మొక్కలను నాటుకోవాల్సి ఉంటుంది. మొక్క నాటిన రోజు నుంచి క్రమం తప్పకుండా ఎదుగుదలకు అవసరమైన ఎరువులను వాడుతూ ఉండాలి. మూడో సంవత్సరం నుంచే కాపు దశ మొదలైనప్పటికీ నాలుగు సంవత్సరాల వరకూ కాయ రాకుండా పూతను ఎప్పటికప్పుడు రాలిపోయేలా చేయాలి. నాలుగో సంవత్సరం నుంచి ఏడాదికి రెండుసార్లు దిగుబడులు వస్తాయి. ప్రతి కటింగ్‌కు ఎకరాకు 7 నుంచి 8 టన్నుల వరకూ దిగుబడి వస్తుంది. మార్కెట్‌లో టన్ను చీనీ ధర ప్రస్తుతం రూ.40 వేల వరకూ పలుకుతున్న నేపథ్యంలో ఎకరాకు ఏటా రూ.5 లక్షల వరకూ రైతన్నలకు ఆదాయం సమకూరుతుంది.

తెగుళ్లు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

పంట కటింగ్ చేపట్టిన ప్రతిసారి కిందకి వాలినకొమ్మలను కత్తిరించి, వాటికి బోర్డియా పేస్ట్‌ను పెట్టుకుంటే తెగుళ్లు రాకుండా పంటను కాపాడుకోవచ్చు. మొక్క కొనుగోలు నుంచి గుంతలు తీయడానికి, ఎరువులు తదితర మందు వాడకానికి మూడు సంవత్సరాల వరకూ కలిపి ఎకరాకు రూ.28 వేల వరకూ ఖర్చు అయితే దిగుబడులు ప్రారంభమైనన ఏడాది నుంచి కలుపు, కటింగ్స్ తదితర వాటిని కలుపుకొని ఎకరాకు ఏడాదికి రూ.50 వేల వరకూ ఖర్చు అవుతుంది. చీనీ సాగులో పంట కాపు దశకు వచ్చే వరకూ వేరుశనగ, మిరప, ఇతర కూరగాయలతోపాటు, పూలతోటలు కూడా సాగుచేసుకోవచ్చని ఉద్యాన అధికారులు సూచిస్తున్నారు.

నియోజకవర్గంలో చీనీ సాగు ఇలా..	
మండలం	ఎకరాలు
గుంతకల్లు	671
గుత్తి	1,575
పామిడి	5,337

చీనీ సాగుతో ఆర్థికాభివృద్ధి



బోర్లలో నీరు సమృద్ధిగా ఉండి వాతావరణం అనుకూలంగా ఉంటే చీనీ సాగులో మంచి లాభాలను పొందవచ్చు. మొక్కలు కొనుగోలు చేసే సమయంలో రైతులు జాగ్రత్త వహించి ఏడాది వయసున్న అంటు మొక్కలు మాత్రమే కొనుగోలు చేయాలి. చీనీ పంటకు ఎక్కువగా వేరుకుళ్లు తెగులు వ్యాపిస్తుంది. తెగులు ఎక్కువగా వస్తున్నట్లయితే డ్రిప్ పైప్‌ను చెట్టుకు దూరంగా ఉంచాలి.
– మిత్రవింద మాధవి, హార్టికల్చర్ ఆఫీసర్

45 టన్నుల దిగుబడి వచ్చింది



ఆరు సంవత్సరాల క్రితం చీనీ పంట సాగు చేశాను. ఎకరాకు 5 టన్నుల చొప్పున మూడు కటింగ్‌లకు కలిపి 45 టన్నుల దిగుబడి వచ్చింది. ఖరీఫ్‌లో వర్షాలు, గాలుల తీవ్రత వల్ల పూత రాలిపోవడం పాటు కాయ నాణ్యత తగ్గడంతో టన్ను రూ.20 వేలు ధర పలికింది. రబీ సీజన్‌లో టన్ను రూ. 30 వేల వరకూ పలికింది. ఇప్పటిదాకా రూ.10 లక్షల వరకూ పంట దిగుబడి వచ్చింది. – గంగాధరరెడ్డి, రైతు అయ్యవారుపల్లి

రూ.5 లక్షల ఆదాయం



ఆరు సంవత్సరాల క్రితం మూడు ఎకరాల్లో చీనీ సాగు చేపట్టాను. మొక్కల కొనుగోలు, డ్రిప్, ఎరువులు, పురుగు మందులు, కలుపు, పంట కటింగ్ తదితర వాటికి ఇప్పటిదాకా రూ. 3 లక్షల వరకూ ఖర్చు అయింది. పంట చేతికి వచ్చిన తరువాత రెండు కటింగ్‌లకు కలిపి 24 టన్నుల దిగుబడి రాగా మార్కెట్ ధర టన్ను రూ.20 వేలు పలకడంతో రూ.5 లక్షల ఆదాయం వచ్చింది. – మునిస్వామి, రైతు, నాగసముద్రం

ఉపాధి పథకంతో ఊతం



ఐదు ఎకరాలు, అంతకంటే తక్కువ భూమి ఉన్న రైతులకు పండ్ల తోటల పెంపకానికి ఉపాధిహామీ పథకం ఊతంగా నిలుస్తుంది. చీనీ, దానిమ్మ, సపోట, అల్లనేరేడు, మామిడి, నిమ్మ తదితర పండ్ల తోటల పెంపకంలో భాగంగా మొక్కల కొనుగోలు దగ్గరనుంచి మూడుసంవత్సరాల వరకూ అయ్యే పూర్తి ఖర్చును ఉపాధిహామీ పథకం ద్వారా ప్రభుత్వమే చెల్లిస్తుంది. – శ్రీకాంత్ చౌదరి, ఉపాధి ఏపీఓ

క్లుప్తంగా

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ భార్గవ్

తాడిపత్రిటౌన్: తాడిపత్రి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందజేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ శివనారాయణ, సీనియర్ అసిస్టెంట్లు మంజుల, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు ఎంపిక



విద్యార్థిని ప్రమీలను అభినందిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: చెన్నైలోని అలగప్ప యూనివర్సిటీలో ఈ నెల 29 నుంచి డిసెంబర్ 2 వరకూ నిర్వహించనున్న సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ ఫస్టియర్ విద్యార్థిని ఎన్.ప్రమీల ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రమీలను ప్రిన్సిపాల్‌తోపాటు కామర్స్ హెచ్‌ఓడీ జనార్దన్‌శాస్త్రి, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ బాలకృష్ణ, పీడీ జి.సురేష్ అభినందించారు. సౌత్‌జోన్‌లో పోటీల్లో ప్రతిభ కనబరిచి కళాశాలకు, ఎస్కే యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం



రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన జస్వంత్

గుత్తి: మచిలీపట్నంలో ఈ నెల 19 నుంచి 21 వరకూ నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ (స్కూల్ గేమ్స్) పోటీల్లో సేవాగడ్ గిరిజన పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎన్.జస్వంత్ 80 ప్లస్ కేజీల విభాగంలో కాంస్య పతకం(ద్వితీయ స్థానం) సాధించాడు. పతకం సాధించిన జస్వంత్‌ను ప్రిన్సిపాల్ ఫయాజ్, బాక్సింగ్ కోచ్ పెద్దక్క, పీడీ చిన్న కృష్ణనాయక్, పీఈటీ విజయ్ కుమార్ నాయక్, ఫుట్ బాల్ కోచ్ రాజా, అథ్లెటిక్ కోచ్ చలపతి, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే విద్యార్థి ప్రతిభపై గొందిపల్లిలో తల్లిదండ్రులు శ్రీనివాసులు, భాగ్యలక్ష్మి, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అరబిక్ జూనియర్ కళాశాల ప్రారంభించాలి

గుంతకల్లు: లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన అరబిక్ జూనియర్ కళాశాలను వెంటనే ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం కమిషనర్ నయీమ్ అహమ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ముసలిరెడ్డి తిమ్మారెడ్డి, ఫిరోజ్‌ఖాన్, గుల్ఫర్‌రోష్, జిలాన్, ఖాదర్‌వలి, రామ్‌రెడ్డి, కుల్లయ్య పాల్గొన్నారు.

జాబ్‌కార్డుల పునఃపరిశీలన



మాట్లాడుతున్న ఉపాధి సిబ్బంది

శింగనమల: బుక్కరాయసముద్రం మండలంలోని గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ జాబు కార్డులను శుక్రవారం పునపరిశీలన చేశారు. మండలంలోని పసులూరు, పొడరాళ్ల, వడియంపేట, దండువారిపల్లి, సిద్దరాంపురం, గోవిందపల్లి, బొమ్మలాటపల్లి, దయ్యాలకుంటపల్లి, రెడ్డిపల్లి, కొర్రపాడు, నీలాంపల్లి, , బి.కొత్తపల్లిలో జాబుకార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

గుంతకల్లు: ఏపీటీఎఫ్ –257 సభ్యత నమోదు కార్యక్రమాన్ని శనివారం పట్టణంలోని మున్సిపల్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులతో సభ్యతం కట్టించారు. ఈ సందర్భంగా సంఘం బలోపేతానికి కృషి చేయాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు కె.నారాయణ కుమార్, బాబాఫక్రుద్దీన్, ఉదయ్ బాస్కర్, వీరాంజినేయులు, లాలెప్ప, ఉమామహేశ్వర్, నామేనాయక్ పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి సన్నిధిలో సహాయ కమిషనర్



మాన్యం భూములపై ఆరా తీస్తున్న సహాయ కమిషనర్ ఆదిశేషయ్యనాయుడు

యాడికి: మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామిని దేవదాయ శాఖ సహాయ కమిషనర్ ఆదిశేషయ్యనాయుడు శుక్రవారం సందర్శించారు. ప్రధాన అర్చకుడు హరికృష్ణ శర్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అర్చకులు, నాయకులతో సమావేశ మయ్యారు. చెన్నకేశవ స్వామికి ఉన్న మాన్యం భూములు, ఆభరణాలు, నగదుపై ఆరా తీశారు. ఈ విషయంపై ఫోన్ చేసినా ఈఓ దుర్గాప్రసాద్ స్పందించక పోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలల తరబడి ఆలయానికి రావడం లేదని, ఉత్సవాల సమయంలో మాత్రమే ఈఓ కనబడుతాడని కొందరు ఆదిశేషయ్యనాయుడు దృష్టికి తీసుకుపోయారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వన్నూరుస్వామి, సీనియర్ అసిస్టెంట్ తులసి తదితరులు పాల్గొన్నారు.

దొంగల బెడద నుంచి కాపాడండి

పామిడి: మండలంలోని రైతులను దొంగల బెడద నుంచి కాపాడాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సాకే గోవింద్ కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ యుంగధర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కొద్ది రోజులుగా పొలాల్లోని మోటార్లు, పైపులు, స్టార్టర్ బాక్స్‌లను రాత్రివేళ దొంగలు ఎత్తుకెళ్తున్నారన్నారు. దీంతో అన్నదాతకు తీవ్ర ఆర్థికనష్టం సంభవిస్తోందన్నారు. చోరీకి గురైన వ్యవసాయ సామగ్రిని గుజిరీల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. పోలీసులు స్థానిక గుజిరీ షాపులపై నిఘా ఉంచి, దొంగలపై చట్టరీత్యా చర్యలు చేపట్టాలన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలి



డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మలేరియా అధికారి డాక్టర్ ఓబులు

గార్లదిన్నె: మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలో ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు సూచించారు.శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఏఎన్‌సీ క్లినిక్‌ను జిల్లా మలేరియా అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు రోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేసుకోవాలన్నారు.అనంతరం గార్లదిన్నెలో నిర్వహించిన డ్రై డే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి గౌతమి, సీహెచ్‌ఓ లోక్‌నాథ్, సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సూపర్‌వైజర్స్ నూర్‌బాషా, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: ప్రతిఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అంజనేయులు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన వ్యక్తిగత మరుగుదొడ్లు వాడటం వలన కలిగే లాభాలను వివరించారు. మూత్ర విసర్జన చేసిన అనంతరం చేతులు, కాళ్లు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష సందర్భంగా హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

నార్పల: మండల కేంద్రంలోని తిక్కయ్యస్వామి ఆలయ ఆవరణలో గణపతి, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహల ప్రతిష్ట శుక్రవారం వైభవంగా నిర్వహించారు. విగ్రహాలను డాక్టర్లు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి వితరణ చేయగా వైఎస్సార్‌సీపీ నాయకుడు, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచు స్వాతిలతారెడ్డి సమక్షంలో వైభవంగా ప్రతిష్టించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో కేబుల్ చోరీ

పుట్లూరు: మండలంలోని ఏ.కొండాపురం గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి కేబుల్ చోరీ చేశారు. గురువారం రాత్రి ఈ చోరీ జరిగినట్లు బాధిత రైతు వెంకటరమణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ హేమాద్రి, ఏఈ విజయుడు పరిశీలించారు.



చింతకుంటలో మినీ గోకులం షెడ్డును పరిశీలిస్తున్న ఏపీడీ విజయ్‌కుమార్

డ్రైవర్‌కు గాయాలు

యాడికి: నిలిచి ఉన్న ఐచర్ వాహనాన్ని ఎదురుగా వచ్చిన లారీ ఢీ కొన్న ఘటనలో ఐచర్ వాహనం డ్రైవర్‌కు కాలు విరిగింది. పోలీసుల వివరాల మేరకు.. నంద్యాల జిల్లా రుద్రవరం మండలం లింగాలదిన్నె గ్రామానికి చెందిన ఓబులపతి కుమారుడు ఓబులేసు లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఓబులేసు శుక్రవారం తెల్లవారు జామున ఐచర్ వాహనంలో గ్రానైట్ బండలతో బయలుదేరి, రాయలచెరువు గ్రామంలో సుంకులమ్మ గుడి వద్ద ఐచర్‌ను ఆపి నిద్రపోయాడు. మహారాష్ట్రకు చెందిన ఓ లారీ గుత్తి నుంచి తాడిపత్రి వైపు పోతూ నిలబడిన ఐచర్ వాహనాన్ని ఢీ కొంది. ఐచర్‌లోని డ్రైవర్‌కు తీవ్ర గాయాలవడంతో సమీపంలోని వారు 108 ద్వారా తాడిపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచన మేరకు ఓబులేసును అనంతపురం తరలించారు. ఓబులేసు ఫిర్యాదు మహారాష్ట్రకు చెందిన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైతుల రుణాలు రీషెడ్యూల్ చేయాలి

గార్లదిన్నె: మండల కేంద్రం గార్లదిన్నె, మర్తాడు, కల్లూరు, పెనకచెర్ల డ్యాంలో ఉన్న బ్యాంకుల్లో రైతులు తీసుకున్న పంట రుణాలు వెంటనే రీషెడ్యూల్ చేయాలని రాయల సీమ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాయల సీమ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్య దర్శి అక్బర్ మాట్లాడుతూ ప్రభుత్వం గార్లదిన్నెను కరువు మండలంగా గుర్తించిందన్నారు. బ్యాంకు అధికారులు వెంటనే ఆయా బ్యాంకుల్లో రైతులు తీసుకున్న పంట రుణాలు రీషెడ్యూల్ చేయాలని డిమాండ్ చేశారు.అలాగే పంటలకు బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలన్నారు. ఈ మేరకు గార్లదిన్నె కెనరా బ్యాంకు మేనేజర్ వెంకటశి వారెడ్డికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

గోకులం షెడ్ల పరిశీలన

పుట్లూరు: మండలంలోని చింతకుంటలో ఉపాధి పథకం కింద రాయితీతో నిర్మిస్తున్న మినీ గోకులం షెడ్లను శుక్రవారం ఏపీడీ విజయ్‌కుమార్ పరిశీలించారు. నిబంధనల మేరకు షెడ్ల నిర్మాణాలు నిర్దీత కొలతల్లో చేపట్టాలన్నారు. అనంతరం షెడ్ల నాణ్యతను పరిశీలించారు. ఆయన వెంట ఏపీఓ చెన్నకేశవులు, సిబ్బంది ఉన్నారు.

మట్కా బీటర్ అరెస్టు

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లో సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు గురువారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రాజ్‌కుమార్ అనే వ్యక్తి మట్కా రాస్తుండగా అరెస్టు చేశారు. అతడి నుంచి రూ. 11,600 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సారా విక్రేత అరెస్టు

గుత్తి: గుత్తి ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలోని రాయలచెరువు గ్రామ సమీపంలో శుక్రవారం సీఐ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దైవాల మడుగు గ్రామానికి చెందిన రమాదేవి అనే మహిళ నాటుసారాను తరలిస్తుండగా అరెస్టు చేశారు. ఆమె నుంచి ఐదు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

పెద్దవడుగూరు: మండలంలోని గుత్తిఅనంతపురం గ్రామం సమీపంలోని వంక నుంచి ఇసుకను అక్రమంగా ఇరత ప్రాంతాలకు తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు శుక్రవారం తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

'భూమిని స్వాధీనం చేయండి'

శింగనమల: దళిత యువతి కుటుంబానికి కేటాయించిన భూమిని స్వాధీనం చేయాలని దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం బుక్కరాయసముద్రం తహసీల్దార్ పుణ్యవతికి వినతి పత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మాట్లాడుతూ 2019లో అనంతపురానికి చెందిన దళిత యువతి స్నేహలతను ధర్మవరం సమీపంలో అత్యంత దారుణంగా హత్య చేశారన్నారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని అన్ని కుల ప్రజా సంఘాలు అప్పట్లో ఆందోళన చేయగా అధికారులు బుక్కరాయసముద్రం మండలంలోని సిద్దరాంపురం సమీపంలో ఐదు ఎకరాలు మృతురాలి తల్లి లక్ష్మిదేవి పేరు మీద పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేశారన్నారు. అయితే ఆ భూమి శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీకి సంబంధించినదని, వెటర్నరీ అధికారులు భూమిలోకి రానివ్వడం లేదన్నారు. అధికారులు స్పందించి దళిత మహిళ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి, పూసల సంఘం జిల్లా అధ్యక్షుడు హనమంతు, సమతా సైనిక్ దళ్ అధ్యక్షులు శ్రీనివాసులు, జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ' ప్రత్యేక ఓటరు నమోదు'

తాడిపత్రి రూరల్: బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు ఈనెల 23, 24న పోలింగ్ కేంద్రాల్లో ఉండాలని శుక్రవారం తాడిపత్రి ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నాగేంద్ర ప్రసాద్ సూచించారు. నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో రెండు రోజుల పాటు కొత్త ఓటర్లు, ఓటర్ కార్డులోని మార్పులు చేర్పులు తదితర అంశాలపై దరఖాస్తులను తీసుకోవాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు ఉండాలన్నారు.

పామిడి: పామిడితో పాటు మండలంలోని అన్ని పోలింగ్‌కేంద్రాల్లో శనివారం, ఆదివారం ఓటరు నమోదుపై స్పెషల్ కాంపైయిన్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీధరమూర్తి శుక్రవారం రాత్రి తెలిపారు. కొత్తగా ఓటరు నమోదు, మార్పు, చేర్పులకు సంబంధించి నిర్వహిస్తున్న ఈ స్పెషల్ కాంపైయిన్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పప్పుశనగ పంట పరిశీలన

పుట్లూరు: మండలంలోని తక్కళ్లపల్లిలో రబీలో సాగు చేసిన పప్పుశనగ పంటకు ఎండు తెగులు సోకడంతో శుక్రవారం వ్యవసాయ అధికారి కాత్యాయని పరిశీలించారు. మొక్కలు ఎండిపోతున్నట్లు రైతులు ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె ఎండు తెగులు నివారణకు పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో ఏఈఓ హరి, వీపీఏ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది. మార్కెట్ యార్డు సెక్రటరీ బాలాజీరావు, పత్తి కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ భరత్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సెక్రటరీ మాట్లాడుతూ పత్తి క్వింటాల్ రూ.7,471తో కొనుగోలు చేస్తామన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు సిబ్బంది శివ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా జంతువధశాల భవనం



ప్రారంభానికి నోచుకోని జంతువధశాల భవనం

గుంతకల్లుటౌన్: పట్టణ శివారులోని దోనిముక్కల రోడ్డులో 14 సంవత్సరాల క్రితం 12వ ఆర్థిక సంఘం నిధులు రూ.21 లక్షల వ్యయంతో నిర్మించిన జంతు వధశాల భవనం నిరుపయోగంగా మారింది. నిర్మాణపు పూర్తయినా భవనాన్ని వినియోగించకపోవడంతో ఆ పరిసరాలన్నీ మందుబాబులు, పేకాటరాయుళ్లకు అడ్డాగా మారాయి. పట్టణానికి 4 కి.మీ దూరంలో ఈ జంతువధశాలను నిర్మించడం, కబేళాకు వెళ్లడానికి రస్తాను ఏర్పాటు చేయకపోవడంతో మాంసపు విక్రేతలు అక్కడకు వెళ్లడానికి అయిష్టత చూపారు. అప్పట్లో రూ.4.60 లక్షల వ్యయంతో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదించినా..టెండర్లే పిలవలేదు. జంతు వధశాల నిర్వహణను ప్రైవేట్ సంస్థకు అప్పగించే దిశగా చర్యలు చేపడుతామని, హైదరాబాద్‌కి చెందిన ఫర్హా ఆగ్రో ఇండస్ట్రీస్ వారితో సంప్రదించామని అధికారులు చేసిన ప్రకటనలు కూడా మాటలకే పరిమితమయ్యాయి. గత వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో భవనంలోని కొంత భాగాన్ని ఆర్‌బీకే నిర్వహణకు వినియోగించినా తిరిగి మూతపడింది. ప్రస్తుతం జగనన్న లేఔట్‌ల పుణ్యామా అని జంతువధశాల భవనం చుట్టూ పేదల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి వృథాగా మారిన ఆ భవనాన్ని ప్రజాఅవసరాల దృష్ట్యా ఏదో ఒక ప్రభుత్వ కార్యాలయాన్నైనా ఏర్పాటు చేయడమో లేక జంతువధశాలకైనా వినియోగించుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ నయీమ్‌ను సాక్షి వివరణ కోరగా శానిటేషన్ అధికారులతో చర్చించి జంతువధశాలను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపడుతానన్నారు.

గేదె ప్రాణాలు కాపాడిన వైద్యుడు

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్లకు చెందిన ఓ గేదెకు శింగనమల పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ పద్మనాభం సకాలంలో వైద్యం చేసి ప్రాణాలు కాపాడారు. వివరాలు.. పురుషోత్తమరెడ్డి అనే పాడి రైతుకు చెందిన గేదె ఈనలేక ఇబ్బంది పడుతుండడంతో గార్లదిన్నె పశువైద్యాధికారి రమేష్‌కు సమాచారమిచ్చారు.ఆయన సెలవులో ఉండడంతో శింగనమల పశువైద్యశాలకు రెఫర్ చేశారు. శింగనమలలో డాక్టర్ పద్మనాభం గేదెను పరీక్షించి గర్భాశయం 108 డిగ్రీల పైన మెలికలు తిరగడం వల్ల ఈనలే క పోతుందని నిర్ధారించారు. ఛాపర్స్ పద్ధతిలో గేదె గర్భాశయం మెలికను తొలగించి, లోపల చనిపోయిన దూడను బయటకు తీశారు. ప్రస్తుతం గేదె ఆరోగ్యంగా ఉందని డాక్టర్ తెలిపారు.

హెర్నియా ఆపరేషన్ విజయవంతం

పామిడి: పట్టణ కమ్యూనిటీ ఆస్పత్రిలో శుక్రవారం వైద్యాధికారి జీ శివకార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్యులు అంబ్లికల్ హెర్నియా ఆపరేషన్‌ను విజయవంతం చేశారు. అంబికల్ హెర్నియాతో బాధపడుతున్న పట్టణంలోని కొల్లప్ప పామిడి కమ్యూనిటీ ఆసుపత్రిని సంప్రదించారు. డాక్టర్ శివకార్తీక్‌రెడ్డి సారథ్యంలో వైద్యులు కమలాకర్, రాఘవేంద్రరెడ్డి, హనీఫ్ ఆపరేషన్‌ను సక్సెస్ చేశారు. ఇందుకు అతడి కుటుంబసభ్యులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.